జిల్లాలో 22 నుంచి చంద్రబాబు పర్యటన

ప్రజాశక్తి-విజయనగరం కోట

టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు మూడు రోజుల పాటు జిల్లాలో పర్యటించనున్నారు. ఈనెల 22న రాజాం, 23న బొబ్బిలి, 24న విజయనగరం నియోజక వర్గాలలో పర్యటిస్తారని విజయ నగరం పార్లమెంట్ పార్టీ అధ్యక్షులు కిమిడి నాగార్జున తెలిపారు.పర్యటనను విజయ వంతం చేసేందుకు సన్నాహకంగా బుధవారం అశోక్‌బంగ్లాలో పార్టీ నాయకులు అశోక్‌గజపతిరాజు ఆధ్వర్యాన నాయకులంతా సమావేశమయ్యారు. చంద్రబాబు పర్యటన షెడ్యూల్, ఏర్పాట్లుపై సమీక్షించారు. పార్టీ శ్రేణులంతా చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.

మాట్లాడుతున్న అశోక్ గజపతిరాజు

ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి

సిఐటియు జిల్లా మహాసభలో రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నర్సింగరావు

సిఐటియు జిల్లా నూతన కమిటీతో రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నర్సింగరావు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

ఐక్య పోరాటాలకు అన్ని రంగాల కార్మికులు సిద్ధం కావాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నర్సింగరావు పిలుపునిచ్చారు. పార్వతీపురం పట్టణంలోని శ్రీవిజయలక్ష్మి కళ్యాణ మండపంలో సిఐటియు పదో జిల్లా మహాసభ బుధవారం రెండో రోజు కొనసాగింది. సిఐటియు జిల్లా అధ్యక్షులు గొర్లి వెంకటరమణ అధ్యక్షతన జరిగిన ప్రతినిధుల సభలో రాష్ట్ర అధ్యక్షులు నరసింహారావు, కార్యదర్శి కె.సుబ్బరావమ్మ మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లా ఉద్యమాల ఖిల్లాగా పేరుగాంచిందన్నారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాలరాస్తున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. కార్మిక హక్కులను హరించేందుకు కార్మిక కోడ్‌లు తీసుకొస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. కార్మిక హక్కుల కోసం పోరాటాలు చేస్తే నిర్బంధాలకు పాల్పడి, అక్రమ అరెస్టులు చేస్తున్నారని విమర్శించారు. కార్మిక హక్కులను చట్టబద్ధంగా పొందేందుకు ఐక్య పోరాటాలను ఉధృతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు పిలుపునిచ్చారు.

మహాసభలో పలు తీర్మానాలు

సిఐటియు జిల్లా మహాసభ పలు తీర్మానాలను ఆమోదించింది. అందులో కొన్ని...

- కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలి.
- పెరిగిన ధరలను అదుపుచేయాలి.
- ప్రభుత్వ రంగ ఆస్తుల ప్రయివేటీకరణను ఆపాలి.
- పని ప్రదేశాలలో లైంగిక వేధింపులు జరగకుండా చూడాలి.
- కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలి.
- కార్మిక కోడ్‌లను రద్దు చేయాలి.
- అసంఘటిత కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి.
- స్కీమ్‌వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి.

దావాల రమణారావు

వై.మన్మథరావు

జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులుగా రమణారావు, మన్మథరావు ఎన్నిక

అనంతరం సిఐటియు పార్వతీపురం మన్యం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులుగా దావాల రమణారావు, ప్రధాన కార్యదర్శిగా యమ్మల మన్మథరావు, కోశాధికారిగా గొర్లి వెంకటరమణ, ఉపాధ్యక్షులుగా రెడ్డి వేణు, వి.ఇందిర, ఎన్.వై.నాయుడు, కోలక అవినాష్ కుమార్, సహాయ కార్యదర్శులుగా వి.రామలక్ష్మి, బి.వి.రమణ, ఆర్.రాము, జి.జ్యోతి, ఎం.ఉమామహేశ్వరి, వై.శాంతికుమార్, ఒక కోఆప్షన్ సభ్యులుతోపాటు 29 మంది జిల్లా కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



వధూవరులకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి: పక్కన ఎమ్మెల్యే బడ్డుకొండ, రాజన్నదొర, బొత్స, శ్రీనివాసరావు

ముఖ్యమంత్రికి సాదర స్వాగతం

- వివాహ వేడుకలో పాల్గొనేందుకు విచ్చేసిన జగన్మోహన్‌రెడ్డి
- హెలీప్యాడ్ వద్ద కలిసిన పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు

ప్రజాశక్తి-డెంకాడ

నెల్లిమర్ల ఎమ్మెల్యే కుమారుడి వివాహ వేడుకకు హాజరయ్యేందుకు బుధవారం సాయంత్రం విశాఖపట్టణం జిల్లా దాకమర్రి చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి సాదర స్వాగతం లభించింది. స్థానిక రఘు ఇంజినీరింగ్ కళాశాల ఎదురుగా ఉన్న ఎన్‌సిసి మైదానంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్దకు హెలికాప్టర్ ద్వారా చేరుకున్న ముఖ్యమంత్రికి పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. పర్యటనలో భాగంగా విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, తితిదే ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి, తుడా ఛైర్మన్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, విశాఖపట్టణం జిల్లా కలెక్టర్ ఎ.మల్లిఖార్జున సిఎంతో పాటు హెలికాప్టర్‌లో విచ్చేశారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, పరిశ్రమల శాఖా మంత్రి గుడివాడ అమర్నాథ్, జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, విజయనగరం ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్, నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, భీమిలి, గజపతినగరం, బొబ్బిలి, పార్వతీపురం, పాతపట్నం ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, బొత్స అప్పలనరసయ్య, శంబంగి చిన వెంకట అప్పలనాయుడు, అలజంగి జోగారావు, రెడ్డి శాంతి, ఎమ్మెల్సీలు సురేష్ బాబు, రఘురాజు, పాలవలస విక్రాంత్, వంశీకృష్ణ శ్రీనివాస యాదవ్, వరుదు కళ్యాణి, టిడ్కో ఛైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ తదితరులు సిఎంను కలిసిన వారిలో ఉన్నారు. జిల్లా కలెక్టర్ ఎ. సూర్యకుమారి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, విశాఖపట్నం జాయింట్ కలెక్టర్ కె. విశ్వనాథన్, విజయనగరం, భీమిలి ఆర్డీవోలు సూర్యకళ, సుధాకర్ రెడ్డి ముఖ్యమంత్రిని ప్రత్యేకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

సిఎంకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ సూర్యకుమారి

సిఎం జన్మదినం సందర్భంగా కృతజ్ఞత లేఖలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 21న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులతో జన్మదిన శుభాకాంక్షలు, కృతజ్ఞతా లేఖలను పంపించేందుకు సన్నాహాలు చేస్తున్నామని డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. ఈ మేరకు నగరంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల హెచ్‌ఎంలతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలల్లో సంపూర్ణ మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నాడు-నేడు కార్యక్రమం ద్వారా సిఎం కృషి చేశారన్నారు. అమ్మ ఒడి, విద్యాదీవెన, వైయస్సార్ కిట్లు వంటి పథకాలను ముఖ్యమంత్రి అమలు చేస్తూ విద్యార్థుల భవితకు బాసటగా నిలుస్తున్నారన్నారు. ఇందుకు కృతజ్ఞత తెలుపుతూ ఈనెల 21 కల్లా ముఖ్యమంత్రి కార్యాలయానికి విద్యార్థులచే లేఖలు పంపనున్నట్లు చెప్పారు. సమావేశంలో విద్యా కమిటీ సభ్యులు బాలి పద్మావతి, ఎంఇఒ రాజు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్తు పొదుపుపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యుత్‌ను పొదుపు చేస్తే దేశానికి సేవ చేసినట్లేనని జిల్లా రెవెన్యూ అధికారి గణపతిరావు అన్నారు. విద్యుత్తు వారోత్సవాల్లో భాగంగా ఎపిఇపిడిసిఎల్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక కలెక్టరేట్ నుంచి చేపట్టిన ర్యాలీని డిఆర్‌ఒ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంధన పొదుపు చేయడం ప్రతి ఇంటిలో రోజు వారి అలవాటుగా మారాలన్నారు. విద్యుత్ పొదుపు వల్ల పర్యావరణాన్ని పరిరక్షించేందుకు పరోక్షంగా సహకరించినట్లు అవుతుందన్నారు. పర్యావరణాన్ని కాపాడటం ద్వారా భావి తరాల మంచి భవిష్యత్ ఇవ్వవచ్చునన్నారు. ప్రధానంగా ఇంధన పొదుపు చేయడం విద్యార్థి దశ నుంచే నేర్పించాలని కోరారు. పొదుపు వారోత్సవాలు నిర్వహించడం ద్వారా ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. అనంతరం ఎపిఇపిడిసిఎల్ ఎస్‌ఇ పి.నాగేశ్వరరావు మాట్లాడారు. ప్రధానంగా గ్రామ స్థాయిలో ప్రజల్లో అవగాహన పెంచేందుకు ర్యాలీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 20వ తేదీ వరకు జరిగే వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు.

ర్యాలీలో విద్యుత్ శాఖ ఇఇ నాగిరెడ్డి కృష్ణమూర్తి, డిఇలు, విద్యుత్ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

ర్యాలీని ప్రారంభిస్తున్న డిఆర్‌ఒ గణపతిరావు

24గంటల్లో తాగునీటి పైపుల మరమ్మతులు

కమిషనర్ శ్రీరాములు నాయుడు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరానికి తాగునీరు అందించే ప్రధాన పైపుల మరమ్మతు పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టి 24 గంటల్లోగా నీరు సరఫర పునరుద్ధరించాలని ఇంజినీరింగ్ అధికారులకు కమిషనర్ ఆర్.శ్రీరాముల నాయుడు ఆదేశించారు. తాటిపూడి నుండి నగరానికి పంపిణీ జరిగే ప్రధాన పైపులైను జాతీయ రహదారి ఏర్పాటు పనుల్లో మరమ్మతులకు గురైందని తెలిపారు. పైపులైన్ల పరిస్థితి, చేపట్టాల్సిన చర్యలు గూర్చి సమీక్షించేందుకు కమిషనర్ ఆర్ శ్రీరాములనాయుడు తామరాపల్లి జంక్షన్ వద్ద ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రధాన పైపులైన్ మరమ్మతు పనులు పూర్తి చేసి తక్షణమే నీటి పంపిణీ పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశించారు. విశాఖపట్నం నుండి వెల్డింగ్, కటింగ్ వంటి భారీ యంత్రాలను తరలించి మరమ్మతు పనులను చేపట్టేందుకు చర్యలు చేపట్టామన్నారు. సాధ్యమైనంత త్వరగా నీటి పంపిణీ పునరుద్ధరణ చేపట్టేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఇఇ శ్రీనివాసరావు, డిఇ అప్పారావు, ఎఇ పాల్గొన్నారు.

ఎన్నికైన ఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా కమిటీ సభ్యులు

ఎపిఎన్‌జిఒ సంఘం జిల్లా కమిటీ ఎన్నిక

అధ్యక్ష కార్యదర్శులుగా మురళి, సురేష్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎపి ఎన్‌జిఒ సంఘం జిల్లా కమిటీ ఎన్నిక బుధవారం స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో జరిగింది. అధ్యక్షులుగా జె.మురళి, కార్యదర్శిగా ఎ.సురేష్, కోశాధికారిగా ఎస్‌వి సుధాకర్ ఎన్నికయ్యారు. అసోసియేట్ అధ్యక్షులుగా జివిఆర్‌ఎస్ కిషోర్, ఉపాధ్యక్షులుగా కె.ఆదిలక్ష్మి, కెబి శ్రీనివాసరావు, ఎన్.నీలాద్రినాయుడు, జె.విక్టర్, ఆర్.శ్రీస్వప్న, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఆర్.వేణుగోపాలరావు, జాయింట్ సెక్రటరీలుగా జివిఎస్‌ఎన్ మూర్తి, ఎ.కనకరాజు, టి.శ్రీధర్‌బాబు, ఎల్.తవుడు, టి.శ్రీవిద్య ఎన్నికయ్యారు.

మంగతాయారు మృతికి పలువురి సంతాపం

ప్రజాశక్తి-విజయనగరం కోట

ప్రముఖ వయోలిన్ విద్వాంసులు ద్వారం వెంకటస్వామి నాయుడు కుమార్తె ద్వారం మంగతాయారు(86) మృతికి పలువురు సంగీత కళాకారులు సంతాపం తెలిపారు. మంగతాయారు బుధవారం చెన్నైలో కన్నుమూశారు. వెంకటస్వామినాయుడుకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు కాగా, వారిలో మంగతాయారు ఒకరు. 1937 ఆగస్టు 29న ఆమె జన్మించారు. సంగీతమే పరమావధిగా భావించి జీవితాన్ని సంగీతానికి అంకితం చేసిన ఆమె గొప్ప వయోలిన్ (వాయు లీనం) విద్వంసురాలు. ఆమె బాల్యమంతా విజయనగరంలోనే సాగింది. స్థానిక మహారాజా ప్రభుత్వ సంగీత కళాశాలలో వయోలిన్ నేర్చుకుని డిప్లొమా కోర్సు పూర్తి చేసారు. 1973లో అదే కళాశాలలో ప్రొఫెసర్‌గా చేరారు. రెండేళ్ల తరువాత ఆమె చెన్నై వెళ్లి ఆలిండియా రేడియోలో ఎ- గ్రేడ్ కళాకారిణిగా 16 సంవత్సరాలు పాటు తన సేవలు అందించారు వయోలిన్‌లో సంగీత అకాడమీ నుంచి జీవిత సాఫల్య పురస్కారం, 2012లో సంగీత విద్యా నిధి పురస్కారం అందుకున్నారు. 2015 మన్మథ నామ సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి కళా రత్న పురస్కారం అందజేశారు. ఆమె మృతికి ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ సభ్యులు, ప్రముఖ మృదంగం విద్వాంసులు మండపాక రవి, రోటరీ మ్యూజిక్ అకాడమీ సభ్యులు, అధ్యాపకులు సంతాపం తెలిపారు

పెన్షనర్స్ డే సందర్భంగా 17న సదస్సు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పెన్షనర్స్ డే సందర్భంగా ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 17న జిల్లా పరిషత్ మినిస్టీరియల్ భవనంలో ఉదయం 10 గంటలకు సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి జె. రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రిటైర్డ్ అయిన ఉద్యోగులకు తీవ్ర అన్యాయం చేస్తున్నాయని, దీనికి వ్యతిరేకంగా ఉద్యమించాలని అన్నారు. పెన్షన్ అనేది బిక్ష కాదు అది రాజ్యాంగం కల్పించిన హక్కు అని అన్నారు. సదస్సులో ముఖ్య వక్తగా పోస్టల్ అండ్ ఆర్‌ఎంఎస్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె.నారాయణరావు, ఇతర నాయకులు హాజరవుతారని తెలిపారు. ఇపిఎస్ 95 పెన్షనర్స్ అందరూ విజయవంతం చేయాలని కోరారు.

గంజాయి ఘనత వైసిపిదే

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఆంధ్రప్రదేశ్‌ను గంజాయి, డ్రగ్స్ రాష్ట్రంగా తయారు చేసిన ఘనత జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వానిదేనని తెలుగు యువత పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షులు వేమల చైతన్య బాబు దుయ్యబట్టారు. బుధవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా తెలుగు యువత ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. చైతన్య బాబు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తర్వాత యువతకు ఉపాధి లేక నిరుద్యోగం పెరిగిపోయిందన్నారు. ఈ ఒక్క సంవత్సరంలోనే లక్ష కేజీల పైబడి గంజాయి దొరికిందంటే, ప్రభుత్వ అసమర్థతే కారణమని అన్నారు. దీని రవాణా వెనుక ఈ ప్రభుత్వ నాయకులు హస్తమున్నట్లు యువత భావిస్తుందని మండిపడ్డారు. ప్రభుత్వం కళ్ళు తెరిచి యువత చెడు మార్గం పట్టకుండా ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొగిరి పైడిరాజు, నియోజకవర్గాల అధ్యక్షులు గంటా రవి , పెదిరెడ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ రాష్ట్ర పోటీలకు విద్యార్థుల ఎంపిక

విజయనగరం టౌన్ : ఈనెల 13న రాజీవ్ క్రీడా ప్రాంగణంలో జరిగిన స్కూల్ గేమ్స్ అండర్ 14,17 విభాగంలో వైజాగ్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు టేబుల్ టెన్నిస్ క్రీడలో అండర్ 14 విభాగంలో బిఎస్‌వి రోనిత్, శ్రేయాన్స్ వర్మ, అండర్ 17 విభాగంలో యశ్వంత్ వర్మ,హర్షవర్ధన్, నిషాంత్ నాయుడు ఎంపికయ్యారు. వీరిని పాఠశాల ఛైర్మన్ సీతయ్య, డైరెక్టర్ వీరాస్వామి,ప్రిన్సిపాల్ అభినందించారు.

జెపిఎల్ క్రికెట్ టోర్నమెంట్ అభినందనీయం

క్రీడల శాఖా మంత్రి రోజా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జగనన్న ప్రీమియర్ లీగ్ (జెపిఎల్) క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్న వైసిపి నాయకులు అవనాపు విక్రమ్, డిసిఎంఎస్ ఛైర్ పర్సన్ డాక్టర్ అవనాపు భావన దంపతులకు రాష్ట్రక్రీడా శాఖ మంత్రి ఆర్‌కె రోజా అభినందనలు తెలిపారు. బుధవారం విశాఖపట్నంలో ఆమెను కలిసిన విక్రమ్ దంపతులు క్రికెట్ టోర్నమెంట్ తరపున మంత్రి రోజాను సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి క్రీడలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ యువతలో దాగివున్న ప్రతిభను పెంపొందిస్తున్నారని అన్నారు. ఎన్నడూ లేని విధంగా క్రీడా పోటీలు రాష్ట్రంలో జరుగుతున్నాయని అన్నారు.

మంత్రి రోజాకు పుష్పగుచ్ఛం అందిస్తున్న విక్రమ్ దంపతులు

హెచ్‌బిఎల్ భూ ఆక్రమణ నిర్ధారణ

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని కందివలసలో గల హెచ్‌బిఎల్ పరిశ్రమ యాజమాన్యం ప్రభుత్వ భూమి ఆక్రమణకు పాల్పడుతోందని సర్పంచి దేశెట్టి గణేష్, ఎంపిటిసి సభ్యులు చాపల సత్తిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. పరిశ్రమకు సమీపంలో ఉన్న సర్వేనెంబర్ 141/1లో 1.78 ఎకరాలు గెడ్డవాగు, సర్వే నెంబర్ 144/1లో 2.48 ఎకరాలు పోరంబోకు, గెడ్డవాగు ఆక్రమణకు పాల్పడ్డారని ఫిర్యాదు చేయగా అందులో సుమారు 2.48 ఎకరాలు అక్రమణలో ఉన్నట్లు గుర్తించారు. గుర్తించిన ప్రభుత్వ భూమిలో ఎటువంటి నిర్మాణం చేపట్టరాదని పరిశ్రమ నిర్వాహకులకు రెవెన్యూ అధికారులు సూచించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ఇమంది భాస్కరరావు మాట్లాడుతూ గ్రామాల్లో వాగులు, గెడ్డ పోరంబోకు తదితర ప్రభుత్వ భూమిలో అక్రమణ జరిగితే వెంటనే రెవెన్యూ అధికారులకు తెలియజేయాలన్నారు. ప్రభుత్వ భూముల్లో ఎలా నిర్మాణాలు చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేసారు. ఇకపై ఇలాంటి చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

సీతం కళాశాలను సందర్శించిన మనోవిజ్ఞాన యాత్ర బృందం

ప్రజాశక్తి-విజయనగరం

స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలకు బుధవారం మనో విజ్ఞాన యాత్ర బృందం విచ్చేసింది.ఈ మనో విజ్ఞాన యాత్ర గత నెల 17న అదిలాబాద్‌లో యాత్ర ప్రారంభించి రోజుకో జిల్లా చొప్పున తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో సందర్శిస్తూ విజయనగరం చేరుకుంది. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా కొత్త నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని ప్రముఖ మనస్తత్వవేత్త సుధీర్ సంద్ర విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో ఇసిఇ విభాగాధిపతి డాక్టర్ టిడివిఎ నాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి.రామ్మూర్తి, కళాశాల సంచాలకులు డాక్టర్ శశి భూషణ రావు తదితరులు పాల్గొన్నారు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనా ఖోఖో జట్లు

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు జిల్లా జట్ల ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 17నుంచి 19 వరకు తూర్పుగోదావరి జిల్లా కుతుకులూరు లో జరగబోయే రాష్ట్రస్థాయి అండర్ 17 స్కూల్ గేమ్స్ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక బుధవారం స్థానిక రాజీవ్ క్రీడా ప్రాంగణంలో జరిగింది.ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుండి సుమారు 250 మందికి పైగా క్రీడాకారులు హాజరయ్యారు. పోటీలను ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి సిహెచ్ సత్యనారాయణ, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎల్ వి రమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.గోపాల్, ట్రెజరర్ బి.మల్లికార్జున్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఎన్నికల పర్యవేక్షణ అధికారిడి ఎస్.సాయిరాం వ్యవహరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు డివిరమణ, పెన్షనర్ల సంఘం నాయకులు పెద్దింటి అప్పారావు, జిల్లా వ్యాప్తంగా వచ్చిన ఎన్‌జిఒ సంఘం నాయకులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు వినతి పత్రాన్నిస్తున్న శంకరరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు

అంగన్వాడీ భవనం బాగు చేయాలని వినతి

బొబ్బిలి : పూల్ బాగ్ కాలనీ వల్లభాయ్ పాఠశాలలో అంగన్వాడీ కేంద్రం నిర్వహిస్తున్న భవనాన్ని బాగు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, అంగన్వాడీ యూనియన్ అధ్యక్షులు కామేశ్వరి కోరారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాన్ని వల్లభాయ్ పాఠశాల భవనంలో గత కొన్నేళ్లుగా నిర్వహిస్తున్నామని, భవనం పాడైపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. నాలుగు రోజుల క్రితం భవనం పెచ్చులు పడి అంగన్వాడీ కార్యకర్త తీవ్రంగా గాయపడినట్లు చెప్పారు. పిల్లలపై భవనం పెచ్చులు పడితే పిల్లల ప్రాణాలకు ముప్పు ఉంటుందని, భవనం మార్చాలని ఐసిడిఎస్ సిడిపిఒకు కోరగా సంబంధం లేదంటున్నారని చెప్పారు. భవనం బాగు చేయాలని కమిషనర్‌ను కోరారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ తక్కువ ఖర్చు అయితే భవనం బాగు చేస్తామని లేదంటే భవనం ఖాళీ చేపిస్తామన్నారు.

రామకృష్ణనాయుడు బాటలోనే..

రేగిడి: 'కొన్ని అనివార్య కారణాల వల్ల ఇంతవరకు మిమ్మల్ని కలవలేకపోయాం.. మేము మీ బాటలోనే ఉంటాం..'అంటూ మాజీ సర్పంచ్‌లు వావిలపల్లి నాగభూషణరావు, కొమ్ము శ్రీరాములు అన్నారు. బుధవారం వీరిద్దరూ మాజీ ఎంపిపి కిమిడి రామకృష్ణనాయుడును కలిసి మాట్లాడారు. మండలంలో చేపడుతున్న కార్యక్రమాలు, టిడిపి కార్యకర్తలపై జరుగుతున్న అన్యాయ, అక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా రామకృష్ణనాయుడు మాట్లాడుతూ బూరాడ, తాటిపాడు గ్రామాలు కిమిడి కుటుంబీకులతో ప్రత్యేక అనుబంధం ఉందని, మొదటి నుండి ఆ రెండు గ్రామాలు తెలుగుదేశం కంచు కోటగా పేరు ఉందని అన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలకు ప్రతి ఒక్కరూ సైనికుడిలా పనిచేయలన్నారు. మండలంలో టిడిపి పటిష్టతకు వావిలపల్లి నాగభూషణరావు ముందుండి నడిపించాలని రామకృష్ణనాయుడు కోరారు.

రహదారికి మరమ్మతులు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

వేపాడ : మండలంలోని జాకేరు నుంచి కరకవలస, చామలాపల్లి, వెంకయ్యపాలెం మీదుగా మండల కేంద్రానికి వెళ్లే రహదారి ఒకవైపు జారిపోయింది. దీనిపై ప్రజాశక్తిలో ప్రయాణికులకు పొంచి ఉన్న ప్రమాదం అనే కథనానికి స్పందనగా బుధవారం ఆర్అండ్‌బి అధికారులు మరమ్మతు పనులు చేపట్టారు. వెంటనే స్పందించి తగు చర్యలు చేపట్టినందుకు ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సేవలకే వాలంటీర్ వ్యవస్థ

వేపాడ : ప్రజలకు సేవలు అందించాలని ఉద్దేశంతో గ్రామాలలో వాలంటీర్ వ్యవస్థను ప్రారంభించామని ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవ చేస్తున్న గ్రామ సచివాలయ వాలంటీర్లను టిడిపి నాయకులు కించి పరిచే విధంగా దుర్భసలాడటం పద్ధతి కాదని ఎంపిపి డి. సత్యవంతుడు అన్నారు. లక్కవరపు కోట మండలంలో వాలంటీర్లు చేసిన నిరసన కార్యక్రమానికి బుధవారం ఎంపిపి సంఘీభావం తెలిపారు.

సమన్వయంతో రీసర్వే చేయాలి

బొబ్బిలి : రీసర్వే సమన్వయంతో చేయాలని సర్వే ల్యాండ్స్ అండ్ రికార్డ్స్ ఎడి త్రివిక్రమ్ అన్నారు. శ్రీకళాభారతి ఆడిటోరియంలో బుధవారం రీసర్వేపై సచివాలయ ఉద్యోగులు, విఆర్‌ఒలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఉపయోగకరంగా సర్వే చేయాలని సూచించారు. సర్వేలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం గ్రామాల్లో జరుగుతున్న సర్వేను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపిపి విజయలక్ష్మి

ధాన్యం కొనుగోలు ప్రారంభం

గరివిడి : మండలంలోని వెదుళ్ల వలసలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపిపి మీసాల విజయలక్ష్మి, జెడ్‌పిటిసి వాకాడ శ్రీనివాసురావు బుధవారం ప్రారంభించారు. మండలంలో ఉన్న మూడు సొసైటీల పరిధిలోనూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మీసాల విశ్వేశ్వరరావు, వైస్ ఎంపిపి గుడివాడ వెంకట శ్రీరాములు నాయుడు, సర్పంచ్ గుడివాడ తమ్మినాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు యడ్ల అప్పారావు, కొనిసి కృష్ణం నాయుడు, పిఎసిఎస్ సెక్రటరీ రమణ, ఏఎంసి డైరెక్టర్ బర్నాల సూర్యనారాయణ, మణ్యపురి ఈశ్వరరావు, నెమ్మాది రామునాయుడు, జగదీశ్వరిరావు, శ్రవణ్ కుమార్, తవుడు తదితరులు పాల్గొన్నారు.

వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎంపిడిఒ పట్నాయక్

కొత్త పింఛన్ల వెరిఫికేషన్

వేపాడ : మండలంలోని బల్లంకి, బానాది, కెఆర్‌పేట సచివాలయ పరిధిలో కొత్తగా సామాజిక పింఛను పొందడానికి దరఖాస్తులు పెట్టిన లబ్ధిదారుల వివరాలను ఎంపిడిఒ బిఎస్‌కె పట్నాయక్ బుధవారం పరిశీలించారు. ఈ పరిశీలనలో ఆయా గ్రామ సచివాలయాల పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

శ్రీరాముని పట్టాభిషేకకం చేస్తున్న అర్చకులు

ఘనంగా శ్రీరామ పట్టాభిషేక ఉత్సవం

నెల్లిమర్ల : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం రామస్వామి దేవస్థానంలో బుధవారం అత్యంత వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం, శ్రీరామ పట్టాభిషేకం జరిగాయి. కొత్తవలసకు చెందిన భోగి సావిత్రమ్మ రాసిన రామకోటి పుస్తకాల సమర్పించే కార్యక్రమంలో భాగంగా ఈ ఉత్సవాలను నిర్వహించారు. ఇందులో భాగంగా విశాఖపట్నం, సింహాచలం, విజయనగరం ప్రాంతాలకు చెందిన సుమారు 30 మంది ఋత్విక్‌లతో పారాయణం నిర్వహించారు. ఈ సందర్భంగా రామాయణం, భగవద్గీత, విష్ణుపురాణం, స్త్రోత్ర పారాయణం నిర్వహించారు.

పంచాయతీల అభివృద్ధికి సర్పంచులే కీలకం

ఎపి పంచాయతీరాజ్ డైరెక్టర్ మురళి

ప్రజాశక్తి- దత్తిరాజేరు

గ్రామ పంచాయతీల అభివృద్ధిలో సర్పంచ్ కీలకమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శిక్షణ సంస్థ డైరెక్టర్ జె.మురళి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ అభివృద్ధికి చక్కని ప్రణాళిక తయారు చేసి గ్రామ సభ ఆమోదం తప్పనిసరిగా పొందాలన్నారు. సుస్థిరాభివృద్ధి లక్ష్య సాధనలో భాగంగా కనీసం ప్రతి గ్రామంలో పరిశుభ్రం, పచ్చదనం, నీటిసమృద్ధి, ఆరోగ్యవంతమైన గ్రామం మూడు థీమ్స్ ఉండేలా తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను ఆమోదించబడిన ప్రణాళికలను ఈ గ్రామ స్వరాజ్ పోర్టల్ నందు నమోదు చేయాలన్నారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిలలో ఆమోదం పొంది రాష్ట్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ నిర్దేశాలతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం కేటాయించబడిన నిధులను అభివృద్ధి పనులకు ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సిఇఒ డాక్టర్ ఎం. అశోక్ కుమార్, డిపిఒ నిర్మలాదేవి, డిప్యూటీ సిఇఒ రాజకుమార్, ఎంపిపి గేదెల సింహాద్రి అప్పలనాయుడు, జెడ్‌పిటిసి రౌతు రాజేశ్వరి, వైస్ ఎంపిపిలు బమ్మిడి అప్పలనాయుడు, మిత్తి రెడ్డి రమేష్, మాజీ జెడ్‌పిటిసి మంత్రి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డైరెక్టర్ మురళి

కొనసాగిన శిక్షణ కార్యక్రమం

వేపాడ : స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బందికి ఇస్తున్న శిక్షణ బుధవారం కొనసాగింది. ఈ సందర్భంగా ఎంపిపి డి. సత్యవంతుడు హాజరై పలు సూచనలు చేశారు. మానవ వనరుల సమీకరణను దృష్టిలో ఉంచుకొని గ్రామ పంచాయతీ ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలన్నారు. ఎంపిడిఒ పట్నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ సూచనలు సలహాల మేరకు పంచాయతీల ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి సూర్యనారాయణ, పంచాయతీరాజ్ ఇంజనీరు ఆలీ, పలు శాఖల అధికారులు, సర్పంచులు ఎంపిటిసిలు, సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్

జెజెఎం పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని వావిలపాడు పంచాయతీ పరిధిలోని కరకవలస గిరిజన గ్రామానికి మంజూరైన జలజీవన్‌మిషన్ (జెజెఎం) నిధులు రూ. 15.37లక్షలతో ప్రారంభం కానున్న పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బీల రాజేశ్వరి మాట్లాడుతూ ఇంటింటికి కుళాయి ద్వారా తాగునీటిని అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ పనులను వేగవంతం చేసి ప్రజలకు కుళాయిల ద్వారా తాగునీటిని అందించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. పనుల్లో నాణ్యత తప్పనిసరి అని అన్నారు. అనంతరం ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ వి. దేవి పాలూరు గ్రామంలో జగనన్న కాలనీలో జరుగుతున్న జలజీవన్ మిషన్ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కె వెంకటలక్ష్మి, వైస్ సర్పంచ్ కె. రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వేతనాల పెంపుపై హర్షం

ప్రజాశక్తి - శృంగవరపుకోట

ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న వారికి వేతనాలు పెంచడం హర్షణీయమని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. పట్టణంలోని పుణ్యగిరి రోడ్డులో గల శివాలయం వద్ద ప్రభుత్వ మద్యం దుకాణాలలో పనిచేస్తున్న సూపర్ వైజర్లు, సిబ్బంది ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రభుత్వ మద్యం దుకాణాలలో పనిచేస్తున్న సూపర్ వైజర్లు, సిబ్బందికి ప్రభుత్వం ఇస్తున్న వేతనాలు పెంచడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొడ్డేడ సూరి అప్పారావు, వాకాడ వెంకటరమణ, మోపాడ నాయుడు, ప్రభుత్వ మద్యం దుకాణాలలో పనిచేస్తున్న పలువురు సూపర్ వైజర్లు, వర్కర్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు 18 మంది ఎంపిక

ప్రజాశక్తి- నెల్లిమర్ల

థామస్ పేట ఫుట్‌బాల్ గ్రౌండ్స్‌లో జరిగిన జిల్లా స్థాయి అండర్ 14, 17 బాల బాలికల హాకీ సెలక్షన్సలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బొప్పడం విద్యార్థులు 18 మంది రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు ఎం. నగేష్‌కుమార్ తెలిపారు. వీరంతా అనంతపురం జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ఎంపికైన విద్యార్థులు చందక పల్లవి, వేములు మౌనిక, కూరమా లక్ష్మి ప్రసన్న, పంచాది అనూష, అంబళ్ల మనీష, అంబళ్ల హాసిని, గేదెల హైమావతి, దన్నాన సుకన్య, వేముల లక్ష్మణ్ రావు, సిరియాల పవన్, బల్ల యస్వంత్, రెడ్డి దినేష్, బల్ల చంద్ర శేఖర్, మీసాల జగదీశ్, బొమ్మిడి తరుణ్ కుమార్, కొత్తకోట్ల శశిధర్, బట్టు దుర్గ ప్రసాద్‌లను ప్రధానోపాధ్యాయులు, పాఠశాల ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ చందక స్వామి నాయుడు, బొప్పడం సర్పంచ్ అంబళ్ల కిరణ్ కుమార్, బొంతు పురుషోత్తం నాయుడు, గ్రామ పెద్దలు అభినందించారు.

నెల్లిమర్ల: ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రాష్ట్ర స్థాయిలో రాణించాలి

శృంగవరపుకోట: క్రీడాకారులు జిల్లా స్థాయితో పాటు రాష్ట్రస్థాయిలోనూ రాణించాలని ఎమ్మెల్సీ, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు ఇందుకూరి రఘురాజు ఆశాభావం వ్యక్తం చేశారు. పట్టణంలోని స్పార్టాన్ బ్యాడ్మింటన్ అకాడమీ ఇండోర్ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లాస్థాయి అండర్ 14, 17 బాల బాలికల బ్యాడ్మింటన్ సెలక్షన్స్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా, రాష్ట్ర స్థాయిలోనూ రాణించి మంచి పేరు ప్రతిష్టలను తీసుకురావాలని కోరారు. సెలక్షన్స్‌కు జిల్లా నలుమూలల నుండి హాజరయ్యే బాల బాలికలకు,

ఎస్‌కోట: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘురాజు

ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు భోజన సదుపాయాలు ఏర్పాటు చేసినందుకు వారికి రఘురాజు ధన్యవాదాలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాజు, డాక్టర్ ఎస్‌వి. సత్యశేఖర్, స్పార్టాన్ బ్యాడ్మింటన్ అకాడమీకి చెందిన విజయరామరాజు, స్నేహ స్వచ్ఛంద సంస్థ మెంబర్ వి.రాము, ఆర్గనైజింగ్ కార్యదర్శి, వ్యాయామ ఉపాధ్యాయులు పొట్నూరు శ్రీరాములు, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు లక్ష్మణరావు, చిన్న, ఇతర వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మా భూములివ్వం..

తేల్చి చెప్పిన ఎం.సింగవరం, ఆతవ రైతులు

ప్రజాశక్తి- వేపాడ

పోలవరం ఎడమ కాలువ నిర్మాణం కోసం తమ భూములిచ్చే ప్రసక్తేలేదని ఎం. సింగవరం, ఆతవ రైతులు అన్నారు. భూసేకరణ నిమిత్తం బుధవారం ఆతవ, ఎం. సింగవరం గ్రామాలలో భూ సేకరణ ప్రత్యేక ఉపకలెక్టర్ బి. సుదర్శన్ దొర ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించారు. ఈ గ్రామ సభల్లో పాల్గొన్న వందలాది మంది రైతులు తమ భూములు ఇచ్చేది లేదని తేల్చి చెప్పారు. పోలవరం ఎడమ కాలువ భూ బాధితుల పోరాట కమిటీ కన్వీనర్ చల్లా జగన్ మాట్లాడుతూ కాలువ నిర్మాణంలో భూములు నష్టపోతున్న రైతులకు అంతే మొత్తంలో భూమిచ్చి ఆదుకోవాలని లేని పక్షంలో బయట మార్కెట్లో ఉన్న ధరలతో సరిపోల్చి వేరే ప్రాంతంలో భూమి ఎకరాక బదులు ఎకరా కొనుక్కునే విధంగా పరిహారం చెల్లించి రైతును ఆదుకోవాలని కోరారు. అంతవరకు భూములు ఇచ్చేది లేదని, భూసేకరణ కోసం కనీసం సర్వే కూడా చేయనీయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కృష్ణంరాజు, డిఇ సుప్రజా, ఆతవ సర్పంచ్ గొంప వేమన రాము, బానాది సర్పంచ్ యశోద, బానాది ఎంపిటిసి తులసి, రామచంద్రుడు మాస్టారుతో పాటు రైతులు పాల్గొన్నారు.

భూములు తీసుకోవద్దని వినతి పత్రమిస్తున్న రైతులు

గ్రీన్ అంబాసిడర్ల ధర్నా

వంగర : గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్ల బకాయి వేతనాలు చెల్లించకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్. రామ్మూర్తి నాయుడు హెచ్చరించారు. ఈ మేరకు రాజాం ఎంపిడిఒ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ అంబాసిడర్లకు 9 నెలలుగా వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. కనీస వేతనాలు అమలు చేయకుండా దోపిడీ చేయడం సరైంది కాదని, గ్రామాల్లో రాజకీయ జోక్యం వీళ్ళ పై తీవ్రంగా ఉందని, తొలగింపులు, వేధింపులు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. అనంతరం రాజాం ఎంపిడిఒ కార్యాలయం సిబ్బందికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్ల మండల అధ్యక్ష, కార్యదర్శులు దాలప్పడు, రామయ్య, సింహాచలం, ఆదినారాయణ, త్రినాథరావు, శివ, పరశురాం, రాములు, రాముడు, భాస్కర రావు, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

బాల్య వివాహాలను నిరోధించాలి

ప్రజాశక్తి - గుర్ల

బాల్య వివాహాలు, సామాజిక రుగ్మతలను వెంటాడుతున్నాయని సామాజిక, పరివర్తన సమాచార వ్యవస్థ జిల్లా సమన్వయాధికారి బి.రామకృష్ణ అన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించాలంటే బాల్య వివాహాలను నిర్మూలించాలని, లింగ వివక్ష ఉండరాదని, రక్తహీనతను అధిగమించాలని అన్నారు. బుధవారం గుర్ల కెజిబివి పాఠశాలలో విద్యార్థులకు లింగ వివక్ష, బాల్య వివాహాల నిర్మూలన, జంక్ ఫుడ్ వల్ల కలిగే ప్రమాదాలు, రక్తహీనతను అధిగమించడం ఎలా? పౌష్టికాహారం, మంచి అలవాట్లు, ఉన్నత లక్ష్యాలు తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. రాష్ట్రం సుస్థిర అభివృద్ధి సాధించాలంటే బాల్య వివాహాలు, రక్తహీనత వంటి వాటిని అరికట్టాలన్నారు. ప్రతిరోజు మంచి పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తీసుకోవడం ద్వారా రక్తహీనత రాకుండా కాపాడుకోవచ్చన్నారు. మగ పిల్లలను, ఆడ పిల్లలను సమానంగా చూడాలన్నారు. ఈ వివక్ష తొలగిపోవడానికి సమాజంలో అందరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి. జానకి, విద్యార్థులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

ఊహా మహంతికి అంతర్జాతీయ అవార్డు

ప్రజాశక్తి- దత్తిరాజేరు

ఉత్తరాంధ్ర జిల్లాల్లో గత 30 ఏళ్లుగా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న 'రూరల్ డెవలప్మెంట్ వెల్ఫేర్ సొసైటీ' డైరెక్టర్ ఊహ మహంతిని మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు బుధవారం ప్రశంసించారు. బాల్య వివాహాల నిర్మూలన, బాల కార్మికుల ఉజ్వల భవిష్యత్తుకు చేపడుతున్న సేవా కార్యక్రమాలు, అనేక సామాజిక రుగ్మతలపై చేస్తున్న అవగాహన కార్యక్రమాలకు గుర్తింపుగా ప్రతిష్టాత్మక ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ పురస్కారం లభించింది. మిజోరం గవర్నర్ హరిబాబు ఈ పురస్కారాన్ని ఊహ మహంతికి బుధవారం విశాఖలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత మహిళల్లో చైతన్యం తీసుకువచ్చి వారి పరివర్తనకు రూరల్ డెవలప్మెంట్ వెల్ఫేర్ సొసైటీ తరపున ఊహ మహంతి చేస్తున్న కృషి స్ఫూర్తిదాయకమన్నారు. సంస్థ కార్యక్రమాలపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.

అవార్డు అందుకుంటున్న ఊహా మహంతి

పనులు వేగవంతం

ప్రజాశక్తి- బొబ్బిలి

మున్సిపాలిటీలో 14వ ఆర్థిక సంఘం నిధులతో అభివృద్ధి పనులు వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు కోరారు. తన కార్యాలయంలో అభివృద్ధి పనులపై ఇంజినీరింగ్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 65 పనులకు రూ.4.91కోట్లతో టెండర్ పూర్తి అయితే ఇప్పటి వరకు రూ.2.08కోట్లతో 28పనులు పూర్తి అయ్యాయని, 12 పనులు జరుగుతున్నాయని, మిగిలిన పనులు ప్రారంభించి నెలాఖరు నాటికి పూర్తి అయ్యేలా చూడాలని డిఇ, ఏఇలను ఆదేశించారు. అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు పని చేసే బాధ్యత ఇంజినీరింగ్ ఉద్యోగులు చూడాలని చెప్పారు. పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లతో మాట్లాడి పనులు ప్రారంభించేలా చూడాలన్నారు

కరెంట్ బిల్లు.. గుండె గుబేల్..

ప్రజాశక్తి- బొబ్బిలి

ఎస్‌సి, ఎస్‌టిలు నెలకు 200 యూనిట్లు వరకు విద్యుత్ వినియోగిస్తే బిల్లు చెల్లించనవసరం లేదు. కానీ మండలంలో ఉన్న గిరిజన గ్రామాల్లో గిరిజనులకు రూ.3వేలు నుంచి రూ.22వేలు వరకు విద్యుత్ బిల్లులు చెల్లించాలని ఆశాఖ అధికారులు బిల్లులు ఇవ్వడంతో గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ వినియోగం తక్కువగా ఉన్న బిల్లు అధికంగా రావడం అన్యాయమని గిరిజనులు వాపోతున్నారు. 200 యూనిట్లు కంటే ఎక్కువ విద్యుత్ వినియోగిస్తే బిల్లు చెల్లించాలి. కానీ ఏ నెలకు ఆ నెల బిల్లు ఇవ్వకుండా 2018 నుంచి ఇప్పటి వరకు వినియోగించిన విద్యుత్‌కు బిల్లులు ఒకేసారి చెల్లించాలని చెబితే తాము ఎలా కట్టగలమని గిరిజనులు ప్రశ్నిస్తున్నారు.

మండలంలోని గోపాలరాయుడుపేట పంచాయతీ పరిధిలో ఉన్న ఒడ్డువలస, కొత్తబట్టివలస, పాతబట్టివలసలో నివాసముంటున్న గిరిజనులకు ఒకొక్కరికి రూ.3వేలు నుంచి రూ.22వేలు వరకు విద్యుత్ బిల్లు వచ్చాయి. ఎం.బేసుకు రూ.11వేలు, చోడిపల్లి గట్టుకు రూ.10వేలు, ఎస్. శ్రీనుకు రూ.7,500, చోడిపల్లి లుబ్బురుకు రూ.19వేలు, ఎం.టకురాకు రూ.21,914 బిల్లు వచ్చింది. వేలల్లో బిల్లులు రావడంతో గిరిజనులు బుధవారం విద్యుత్ శాఖ రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. విద్యుత్ బిల్లులు తగ్గించి గిరిజనులకు న్యాయం చేయాలని అఖిల భారత రైతు కూలి సంఘం నాయకులు వెన్నెల వేణు, గిరిజనులు డిమాండ్ చేశారు. లేనిచో పోరాటం చేస్తామని హెచ్చరించారు.

కరెంటు బిల్లులు పట్టుకుని నిరసన తెలుపుతున్న గిరిజనులు

దళారులను నమ్మి మోసపోవద్దు

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

దళారులను నమ్మి మోస పోవద్దని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. బుధవారం కలవరాయి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి అవకతవకలు జరగకుండా వేగవంతంగా ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొత్స నటరాజ్, ఎంపిటిసి పాటూరు సింహాచలం, తహశీల్దార్ నమ్మి రాజారావు, అగ్రికల్చర్ ఏడి శ్యాంసుందర్రావు, పౌరసరఫరాల శాఖ ఉప తహశీల్దార్ సాయికృష్ణ, మాజీ సర్పంచ్ బొత్స విశ్వనాథం, వైసిపి నాయకులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు. కాగా గోపాలరాయుడుపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల వైసిపి అధ్యక్షులు సంబంగి వేణుగోపాల్ నాయుడు ప్రారంభించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

తంగుడుబిల్లిలో 'ఇదేం కర్మ'

నెల్లిమర్ల : మండలంలోని తంగుడిబిల్లి గ్రామంలో 'ఇదేమి కర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమాన్ని టిడిపి మండల పార్టీ అధ్యక్షులు కడగల ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామినాయుడు మాట్లాడుతూ ఈ ప్రభుత్వాన్ని గద్దె దించే రోజులు దగ్గరపడ్డాయన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సువ్వాడ రవిశేఖర్, గేదెల రాజారావు, పోతల రాజప్పన, లెంక అప్పలనాయుడు, పతివాడ అప్పలనాయుడు, గురాన చక్రధర్, సారిపల్లి బాబురావు, గురాన అసిరినాయుడు, కురిమినేని వెంకటరమణ, చందక చిన్నంనాయుడు, దన్నాన రామ్మూర్తి, టొంపల నరసయ్య, కనిగిరి శ్రీనివాస్, దన్నన గోవిందా తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీ చేస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

సేవలన్నీ సచివాలయాల్లోనే

ప్రజాశక్తి- రేగిడి

ప్రభుత్వ సేవలన్నీ గ్రామ సచివాలయాలలోనే జరపాలని ఎంపిడిఒ గన్నవరపు కాశీ విశ్వనాథరావు అన్నారు. బుధవారం ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ సచివాలయాల సర్వీసులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ విధులు, నిధులు, ఖర్చులు, జమలు వంటివి ఎంబుక్ ప్రాప్తికి ఎప్పటికప్పుడు రికార్డులలో నమోదు చేయాలన్నారు. పారిశుధ్యం మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. వీధిలైట్లు, కాలువల పూడిక తీతలు తీయించాలన్నారు. డిజిటల్ అసిస్టెంట్లు ముఖ్య భూమిక పోషించాలని ప్రజలకు జవాబిదారితనంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో ఇఒపిఆర్‌డి నాగభూషణరావు, జూనియర్ అసిస్టెంట్ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

యాప్‌లలో పొందిపరచాలి

గ్రామ పంచాయతీలలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులు, వేతన దారుల వివరాలు ఎన్ఎంఎంఎస్ యాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని ఎంపిడిఒ కాశీ విశ్వనాథ రావు, ఎపిఒ సంకాబత్తుల హరినాథ్ అన్నారు. బుధవారం స్థానిక ఉపాధి కార్యాలయంలో క్షేత్ర సహాయకులు, సాంకేతి సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల గ్రామసభల్లో ఎంపికైన పనులు పంచాయతీలో ప్రతిపాదనలు తయారు చేసి మంజూరుకు పంపించాలన్నారు. నిర్లక్ష్యం చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జాబు కార్డు ఉన్న వారందరికీ పనులు కల్పించేందుకు తక్షణమే ప్రతిపాదనలు తయారుచేసి మంజూరుకు పంపించాలన్నారు. ఈ సమావేశంలో ఇసి రామినాయుడు, టెక్నికల్ అసిస్టెంట్లు భారతి, గురయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE III Rd ADDITIONAL DISTRICT JUDGE (FAMILY COURT JUDGE) CUM MACT AT SRIKAKULAM M.V.O.P 56 / 2021

Between: **Suvvari Jayalaxmi** and another - Petitioners

And: **Singuru Anantha Kumar @** Jagadish and 2 others - Respondents

TO
R2. **Katakoti Satish Kumar,** S/o Narayana Rao, aged about 35 years, Hindu, Owner of crime vehicle , i.e., **SCORPIO NO.CG-07MB**-1930,Resident of LIG -155 , APHB. Colony ,Baba Metta, Vizianagaram Town and District.

Please take notice that the above matter is posted to **23-12-2022** for your appearance ,you are hereby directed to appear before the Honourable court on **23-12-2022** without fail otherwise the matter will be decided in your absence.

Pydi Surya Narayana,
Advocate,
Srikakulam